

అనుపమ్ రెడ్డి, వైవీయస్ చౌదరి, దిల్‌రాజు, దామోదరప్రసాద్, ఏకే రాజు, సునీల్ నారంగ్

# రిలీజ్ ఇష్యూస్‌ని పరిష్కరించాం

సినీరంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, మరోమారు ఆయన్ని కలిసి పరిశ్రమల సమస్యలను వివరిస్తామని చెప్పారు అగ్ర నిర్మాత, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దిల్ రాజు. సోమవారం హైదరాబాద్‌లో తెలుగు ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్ కౌన్సిల్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'మా అభ్యర్థన మేరకు రవితేజ 'ఈగల్' చిత్రం సంక్రాంతి బరి నుంచి తప్పుకుంది. రిలీజ్ డేట్‌ను ఫిబ్రవరి 9కి మార్చుకోవడం జరిగింది. ఇప్పుడు అదే తేదికి సందీప్‌కిషన్ 'ఊరి పేరు భైరవ కోన' అనౌన్స్ చేశారు. ఈ విషయం ఛాంబర్ దృష్టికి రాగానే వెంటనే చిత్ర నిర్మాతలు అనిల్ సుంకర, రాజేష్‌తో మాట్లాడటం జరిగింది. మా వినతిని మన్నించి ఫిబ్రవరి 16కు సినిమాను మార్చుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఛాంబర్ తరపున వారికి కృతజ్ఞతలు. ఇక 'ఈగల్' చిత్రానికి ఎక్కువ థియేటర్లు వచ్చేలా చూస్తాం. అదే డేట్‌కు 'యాత్ర-2' కూడా వస్తున్నది. రాజకీయ పరమైన అంశంతో వారు ముందే డేట్ ఫిక్స్ చేసుకోవడంతో ఛేంజ్ చేసుకోవడానికి ఒప్పుకోలేదు' అన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో జరిగిన మీటింగ్ విశేషాలను తెలియజేస్తూ 'ప్రభుత్వం తరపున ఏ సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం చెప్పారు. ఎల్లుండి ఈసీ మీటింగ్‌లో అన్ని విషయాలు చర్చించి మరోసారి సీఎంను కలుస్తాం' అన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరప్రసాద్, ప్రసన్నకుమార్, వివేక్ కూచిభొట్ల తదితరులు పాల్గొన్నారు.




అల్లరి నరేష్, ఆషికా రంగనాథ్, శ్రీనివాస చిట్టూరి, నాగార్జున, కీరవాణి, విజయ్ బిన్నీ, చంద్రబోస్

# ప్రేక్షకుల చిరునవ్వే నా ధైర్యం

అగ్ర కథానాయకుడు నాగార్జున నటించిన సంపూర్ణ వినోదాత్మక చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై తెరకెక్కింది. శ్రీనివాస చిట్టూరి నిర్మాతగా వ్యవహరించారు. సంక్రాంతి బరిలో వచ్చిన ఈ సినిమా చక్కటి ఆదరణ పొందింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ వేదికపై నాగార్జున చేతుల మీదుగా చిత్రబృందానికి సక్సెస్ షీల్డ్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'సినిమా జయాపజయాలతో నిమిత్తం లేకుండా ప్రేక్షకులు నాకు ఎప్పుడూ ప్రేమను పంచుతున్నారు. నేను కనిపించగానే ప్రేక్షకులు చిరునవ్వుతో వ్యక్తం చేసే ఆ ఆనందమే నాకు ధైర్యం. ఈ సినిమా ప్రయాణం చాలా అద్భుతంగా జరిగింది. ఈ అద్భుతమైన అనుభూతి పంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. వచ్చే సంక్రాంతికి కలుద్దాం' అని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు.

# 'కథ' మళ్లీ మొదటికి..

- దర్శకుడు కొరటాల శివకు సుప్రీంకోర్టులో చుక్కెదురు
- 'శ్రీమంతుడు' స్టోరీపై 'సుప్రీం'లో ముగిసిన వాదనలు
- కింది కోర్టుల నిర్ణయం సబబే అని ధర్మాసనం సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సినీ పరిశ్రమలో సూపర్ హిట్ సినిమాలు కాపీరైట్స్ తంటాలు ఎదుర్కోవడం కొత్త కాదు. తెలుగు ఇండస్ట్రీలోనూ ఇలా వివాదాలు బోలెడున్నాయి. సినిమా హిట్ అయ్యిందన్న ఆనందంతో ఉండే చిత్రబృందానికి ఇలాంటి వివాదాలు తలనొప్పి వ్యవహారమే. గతంలో 'భజరంగీ భాయ్ జాన్' కథ తనదేనంటూ ఒకరు వివాదానికి కాలు దువ్వగా, 2015లో మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కిన చిత్రం 'శ్రీమంతుడు' కూడా వివాదాల సుడిగుండంలో కొట్టిమిట్టాడుతున్నది. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు విశేష ప్రేక్షకాదరణ దక్కింది. ఆ ఏడాది సూపర్ డూపర్‌గా నిలిచిన సినిమాల్లో 'శ్రీమంతుడు' రెండోస్థానాన్ని పదిలపర్చుకుంది. ఈ చిత్ర కథ విషయంలో దర్శకుడు వివాదంలో ఇరుక్కున్న సంగతి తెలిసిందే. తాజాగా సుప్రీంకోర్టులోనూ కొరటాల శివకు చుక్కెదురైంది. ఎనిమిదిన్నరేండ్లుగా ఈ కేసును ఎదుర్కొంటూ వస్తున్న ఆయనకు దేశ సర్వోన్నత న్యాయస్థానమూ మొట్టి కాయలేసింది. స్థానిక కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం క్రిమినల్ కేసు ఎదుర్కోవాల్సిందేనంటూ సుప్రీం స్పష్టం చేసింది.

### కేసు అసలు 'కథ' ఎంటంటే..?

శరత్ చంద్ర అనే రచయిత 'చచ్చేంత ప్రేమ' పేరుతో సినిమా తీసేందుకు జయలక్ష్మి ఫిలిమ్స్ వారికి హక్కులు ఇచ్చారు. నారా రోహిత్ కథానాయకుడిగా సముద్ర దర్శకత్వంలో ఆ సినిమా తీయాలనుకున్నారు. అందుకు సంబంధించి సన్నాహాల్లో ఉండగా 'శ్రీమంతుడు' 2015 ఆగస్టు 7న విడుదలైంది. స్వాతి వారపత్రికలో వచ్చిన తన కథను కాపీ చేసి 'శ్రీమంతుడు' సినిమాగా మలిచారంటూ రచయిత శరత్‌చంద్ర వివాదం లేవనెత్తారు. సినిమా విడుదల సమయంలో కేరళలో ఉన్న ఆయన మిత్రుడు చెప్పిన 'శ్రీమంతుడు' స్టోరీ తన కథలాగే ఉందని గ్రహించి సినిమా చూశారు. వెంటనే సినీ రచయితల సంఘంలో ఫిర్యాదు చేశారు. కొంత మంది పరిశ్రమ పెద్దల దృష్టికీ ఈ విషయాన్ని తీసుకెళ్లారు. తనకు న్యాయం జరిగేలా లేదని భావించి మీడియా ముందుకొచ్చి గోడు వెల్లబోసుకున్నారు. నాంపల్లి కోర్టులో కేసు వేశారు. రచయిత పిటిషన్‌పై విచారణ జరిపి సదరు దర్శకుడిపై చర్యలు తీసుకోవాలంటూ నాంపల్లి కోర్టు ఆదేశించింది. దీంతో నాంపల్లి కోర్టు ఉత్తర్వులపై దర్శకుడు కొరటాల శివ తెలంగాణ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తన కథను కాపీ కొట్టారన్న తన వాదనకు తగ్గ ఆధారాలను శరత్‌చంద్ర హైకోర్టుకు సమర్పించారు. శరత్‌చంద్ర సమర్పించిన ఆధారాలను నిర్ధారిస్తూ రచయితల సంఘం హైకోర్టుకు ఇచ్చిన నివేదిక ఇందుకు బలం చేకూర్చింది. రచయితల సంఘం ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు కూడా నాంపల్లి కోర్టు ఉత్తర్వులను సమర్థించింది. దీంతో చేసేది లేక దర్శకుడు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది.




### తాజాగా సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

కొరటాల శివ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. సినిమా విడుదలైన 8 నెలల తర్వాత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారని.. హైకోర్టు, స్థానిక కోర్టు తమ వాదనను ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదంటూ సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి దర్శకుడు కొరటాల శివ తరపున వాదనలు వినిపించారు. అయితే, రచయితల సంఘం నివేదిక ఆధారంగానే హైకోర్టు నిర్ణయం తీసుకున్నదని, తీర్పులో స్పష్టమైన అంశాలు పొందుపరిచిందని ధర్మాసనం పేర్కొన్నది. కొరటాల శివ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ జరిపేందుకు ఏమీ లేదని కూడా స్పష్టం చేసింది. పిటిషన్‌ను మీరు వెనక్కి తీసుకుంటారా?.. లేక మమ్మల్నే డిస్మిస్ చేయమంటారా?.. అని ధర్మాసనం నిరంజన్‌రెడ్డిని ప్రశ్నించింది. తామే పిటిషన్ వెనక్కి తీసుకుంటామని న్యాయవాది చెప్పడంతో ధర్మాసనం అందుకు అనుమతించింది. చివరికి ఇలా 'కథ' మళ్లీ మొదటికొచ్చినట్లయింది.



మణికందన్, శ్రీగౌరిప్రియ

# పవిత్ర ప్రేమకు దృశ్యరూపం

మణికందన్, శ్రీగౌరిప్రియ, కన్న రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. ఈ చిత్రాన్ని మాస్ మూవీ మేకర్స్, మారుతి టీమ్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నాయి. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం టీజర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు ప్రభురామ్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నా నిజజీవితంలో చూసిన సంఘటనల స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నా. నేటితరం యువతీ యువకుల ప్రేమబంధాలు, వాటిలో తలెత్తె సంఘర్షణ నేపథ్యంలో భావోద్వేగ భరితంగా సాగుతుంది' అన్నారు. ప్రేమజంట తమ ప్రయాణంలో ఎదుర్కొన ఒడిదుడుకులను ఈ సినిమాలో హృద్యంగా చూపించారని నిర్మాత ఎస్‌కేఎన్ తెలిపారు. మనం చూసిన జీవితంలా అనిపిస్తూ సహజమైన ఉద్వేగాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుందని దర్శకుడు మారుతి చెప్పారు. ఆధునిక యువత ప్రేమ సంఘర్షణకు అందమైన దృశ్యరూపంలా ఈ సినిమా ఉంటుందని కథానాయిక నాయకానాయికలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్ కృష్ణ, సంగీతం: సీన్ రోల్డన్, రచన-దర్శకత్వం: ప్రభురామ్ వ్యాస్.



# సూర్యాస్తమయ వేళ గుర్రపు స్వారీ

అగ్ర కథానాయిక సమంత అనారోగ్యం కారణంగా కొంత కాలం నటనకు విరామం ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఆమె కొన్ని వారాలుగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 28న సమంత ఇన్‌స్టాగ్రామ్ పేజీలో తాను గుర్రపు స్వారీ చేస్తున్న వీడియోను షేర్ చేశారు. ఈ వీడియో ఇప్పుడు అన్ని సోషల్ మీడియా వేదికల్లో వైరల్‌గా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో సూర్యాస్తమయ సమయంలో ఆమె గుర్రంపై స్వారీ చేస్తున్న దృశ్యం చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నది. అయితే తన తదుపరి ప్రాజెక్టు కోసం గుర్రపు స్వారీ చేయడంలో పాఠాలు నేర్చుకుంటున్నారా..? అభిరుచి కోసమా అనేదిప్పుడు రహస్యమే. ప్రస్తుతానికైతే రాబోయే ప్రాజెక్టును సమంత ప్రకటించలేరు. నటనకు కొంత విరామం ఇచ్చిన ఆమె పలు దేశాల్లో పర్యటిస్తున్నారు. మోయోసైటిస్‌తో బాధపడుతున్న సమంత దాని నుంచి వీలైనంత త్వరగా కోలుకోవడంపై దృష్టి సారించారు. శివ నిర్వాణ దర్శకత్వంలో వచ్చిన 'ఖుషి'లో సమంత హీరో విజయ్ దేవరకొండతో కలిసి నటించారు. రాజ్, డీకే దర్శకత్వంలో 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. ఆంథోనీ రస్సో నిర్మించిన ఈ యాక్షన్ సిరీస్‌లో వరుణ్ ధావన్, సమంత ప్రధాన పాత్రలు పోషించారు.

# నటుడు వేణుకు పితృవియోగం



టాలీవుడ్ నటుడు వేణు తొట్టెంపూడి ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి ప్రొఫెసర్ వెంకట సుబ్బారావు (92) సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. కొందరు అంత్యక్రియలకు హాజరయ్యారు. నటుడు వేణును పరామర్శించి ఓదార్చారు.

# ఆలోచింపజేసేలా..



యష్ పూరి హీరోగా నటించిన కొత్త సినిమా 'హ్యాపీ ఎండింగ్' అపూర్వ రావ్ కథానాయిక. ఈ చిత్రాన్ని హమ్సటెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేశ్‌కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముంగిట్లోకి రానున్నది. ఈ సందర్భంగా పలు విశేషాలను నిర్మాత అనిల్ పాత్రికేయులతో పంచుకున్నారు. 'సిల్లీ మాంక్స్.. కంటెంట్ క్రియేటింగ్ కంపెనీ. మేము 24 కిస్సెస్ సినిమా ద్వారా ప్రొడక్షన్‌లోకి వచ్చాం. అది యూత్‌ఫుల్ మూవీ అయినా సందేశాత్మక కథ. ఇప్పుడు 'హ్యాపీ ఎండింగ్' కూడా యూత్‌కు నచ్చే మెస్సేజ్ ఒరియంటెడ్ మూవీ. మేకింగ్‌పై అవగాహనారాహిత్యంతో మూడో వ్యక్తిని నమ్మి రూ.కోట్లు నష్టపోతున్నవారు చాలా మందే ఉన్నారు. అలాంటి ప్రొడ్యూసర్స్‌కు మేం అండగా ఉంటున్నాం. ప్రొడక్షన్ నుంచి రిలీజ్ దాకా వారధిలా పనిచేస్తున్నాం. 'హ్యాపీ ఎండింగ్' అనుకున్న బడ్జెట్‌లో ముగించాం. యష్ కొత్త హీరో కాబట్టి రిలీజ్ తర్వాత స్పందనను బట్టి తదుపరి నిర్ణయం తీసుకుంటాం. సినిమాకు కథే ముఖ్యం. బాగా ప్రిపేర్ అయ్యాం కాబట్టే 30 రోజుల్లోనే షూటింగ్ పూర్తిచేశాం. 'హ్యాపీ ఎండింగ్' స్టోరీపై మాకు నమ్మకం ఉంది. సినిమా చూసిన ప్రేక్షకులు వినోదం పొందడమే కాదు ఒక ఆలోచనలో పడతారు. యష్, అపూర్వ థియేటర్ నుంచి వచ్చిన ఆర్టిస్టులు కాబట్టి బాగా ఫర్ఫార్మ్ చేశారు. మా సంస్థ నుంచి ఓటీటీ తీసుకొచ్చే ఆలోచన ఇప్పుడు లేదు. కొత్త హీరోతో చేసిన మరో చిత్రం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది.



మామిడి హరికృష్ణ, కుమారస్వామి, శేఖర్ కమ్ముల, చైతన్య రావు తదితరులు

# పన్నెండు గుంజల పందిర్ల కిందా..

చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి (అక్షర) దర్శకత్వం వహించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. సోమవారం ఈ సినిమాలోని 'పన్నెండు గుంజల పందిర్ల కిందా' అనే గీతాన్ని ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన ఈ గీతానికి సురేష్ బొబ్బిలి సంగీతాన్నందించారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. ఈ పాటలో తెలంగాణ మట్టి వాసనలు కనిపిస్తున్నాయని, తెలంగాణ పాటలు ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయని తెలిపారు. ఈ పాటలో పెళ్లి ప్రారంభం నుంచి అప్పగింతల వరకు అన్ని ఘట్టాలను చక్కగా చూపించారని తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ చెప్పారు. పెళ్లిలోని ప్రతి సందర్భం జీవితమంతా గుర్తుండిపోవాలనే నాయిన ఆకాంక్షను ప్రతిఫలిస్తూ ఈ పాట సాగుతుందని దర్శకుడు కుమారస్వామి పేర్కొన్నారు.

# తెలుగమ్మాయిలే బెటర్



'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం ద్వారా కథానాయికగా పరిచయమవుతున్నది శివానీ నాగరం. చక్కటి గ్రామీణ కథ ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని చెప్పిందీ భామ. సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికనేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా శివానీ నాగరం పాత్రికేయులతో మాట్లాడుతూ 'హీరోయిన్ ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్‌కు వెళ్లే కథానాయికగా సెలెక్ట్ చేయడం ఆనందంగా అనిపించింది. ఈ సినిమా కోసం నెల రోజుల పాటు ప్రిపేర్ అయ్యాను. ప్రతి డైలాగ్‌ను గుర్తుపెట్టుకున్నా. దాంతో షూటింగ్‌లో కష్టమనిపించలేదు. ఈ సినిమాలో నేను లక్ష్మి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. నాకు కూచిపూడి డ్యాన్స్‌లో మంచి అనుభవం ఉంది. పిల్లలకు సంగీతం నేర్పిస్తుంటా. దాంతో డ్యాన్స్ విషయంలో అంత కష్టంగా అనిపించలేదు. హీరోయిన్‌గానే కాదు.. కథలో కీలకంగా ఉండే పాత్రలు చేయడానికైనా సిద్ధంగా ఉన్నా. ప్రతిభ కలిగిన తెలుగమ్మాయిలు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు. తెలుగమ్మాయిలు హీరోయిన్స్‌గా నటిస్తే భాష విషయంలో ఎన్నో అడ్వాంటేజేస్ ఉంటాయి' అని చెప్పింది.



# సంగీతభరిత ప్రయాణం

ఓ వైపు అగ్ర హీరోలతో భారీ చిత్రాలను నిర్మిస్తూనే.. మరోవైపు నూతన ప్రతిభను ప్రోత్సహిస్తూ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులకు చేరువవుతున్నది ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. అదే ఉత్సాహంతో ఈ సంస్థ తెరకెక్కించిన తాజా చిత్రం 'మ్యాజిక్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ నిర్మాత. పలువురు నూతన తారలను పరిచయం చేస్తూ టీనేజ్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ వేసవిలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. కాలేజీ ఫెస్టివల్ కోసం ఒక ఒరిజినల్ సాంగ్‌ను కంపోజ్ చేయడానికి నలుగురు టీనేజర్లు చేసే ప్రయత్నాల చుట్టూ కథ నడుస్తుందని, నీలగిరి ప్రకృతి అందాల నడుమ తెరకెక్కించిన సన్నివేశాలు కనులవిందుగా ఉంటాయని చిత్రబృందం పేర్కొంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు రూపొందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: గిరీష్ గంగాధరన్, ఆర్ట్: అవినాష్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాతలు: నాగవంశీ, సాయిసౌజన్య, రచన-దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

